కమిషనర్ కుర్చీకి కూటమి సెగ

రాజంపేట మున్సిపాలిటీ కమిషనర్ నియామకం సందిగ్ధంలో పడిపోయింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు కూటమి నాయకులు మావాడే రావాలంటూ భీష్మించడంతో కుర్చీపై ఎవరిని కూర్చోబెడతారో తెలియని పరిస్థితి. అధికారపార్టీ నాయకులకు అనుకూలమైన వారే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి.

- కూటమి కుంపటిలో కమిషనర్ కుర్చీ!
- తమకు అనుకూలమైనే అధికారే లక్ష్యంగా అడుగులు
- నియామకానికి నాయకుల ప్రయత్నం


రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం

రాజంపేట: రాజంపేట మున్సిపాలిటీకి కమిషనర్ నియామకం ఉన్నతాధికారులకు కత్తిమీద సాములా తయారైంది. కూటమి నేతల ఒత్తిడితో ఎవరిని నియమించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఓ వర్గ నేతకు అనుకూలంగా కొంత మందిని కౌన్సిల్ ఆమోదం లేకుండానే విధుల్లోకి తీసుకోవడం వివాదాస్పదంగా మారడమే ఆయన సస్పెన్షన్‌కు కారణమే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కమిషనర్ నియామకానికి ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఓటమి పాలైన రాయచోటి వాసి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారిని నియమించేందుకు సిఫార్సు లేఖ తీసుకున్నారు. ఇన్‌చార్జి రేసులో ఉన్న పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ,చామర్తి జగన్‌మోహన్‌రాజు తనకు అనుకూలమైన కమిషనర్‌ను కుర్చీలో కూర్చొబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కేటాయింపులో ఆయన సిఫార్సులు అధికంగా ఉండడమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఇదిలా వుండగా నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం విషయంలో అధిష్టానం నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో కమిషనరు నియామకం ఏ విధంగా ఉంటుందోనని మున్సిపాలిటీ అధికారులు భావిస్తున్నారు.

తమ వాడే కావాలని పోటీ..

రాజంపేట మున్సిపాలిటీ కమిషనర్ బిల్లా నాగేశ్వరరావు సస్పెన్షన్ అనంతరం నూతన కమిషనర్‌లు ఇక్కడికి వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. కమిషనర్‌గా వాచ్చే వారెవరైనా తమ వారే ఉండాలంటూ అధికారపార్టీలో ఇరు వర్గాలు పట్టుపడుతున్నాయి. ఇప్పటికే ఇన్‌చార్జి రేసులో ఉన్న వారంతా తమకు అనుకూలమైన కమిషనర్‌ను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు. సస్పెండ్‌కు గురైన కమిషనర్ అధికారపార్టీకి అండగా ఉన్నారనే విమర్శలు వెలువడ్డాయి. సుగవాసికి అనుకూలంగా ఉండడంతో, మరో వర్గం నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు కమిషనర్‌కు వ్యతిరేకంగా నిరసన గళం విప్పారు. పట్టణంలో కమిషనర్ పని తీరుపై ధ్వజమెత్తారు. దీంతో ఏ నేత సిఫార్సు లేఖలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందోనని కూటమి వర్గాల్లో చర్చ మొదలైంది. బలిజ, కమ్మ వర్గాలకు చెందిన వారినే నియమించుకోవాలనే దిశగా అధికార పార్టీ యోచిస్తోంది.


కమిషనర్ గదికి తాళాలు వేశారిలా..

క్లుప్తంగా

పార్కింగ్ పనులు వేగవంతం


దోజర్‌తో పనులు చేయిస్తున్న సిబ్బంది

సిద్ధవటం: మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని అడవుల్లో వెలసిన నిత్య పూజస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగ నున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు అవసరమైన పనులు శుక్రవారం చేపట్టారు. స్థానిక షాదీఖానా, నూతిరాయి కోన, రెండో ముఖద్వారం, ఆర్టీసీ స్టాపింగ్ కంట్రోల్ పాయింట్, బండి మునిరెడ్డి పొలం సమీపంలోని ప్రదేశాల్లో పార్కింగ్ పనులు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సిద్ధవటం: సిద్ధవటం మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జ్యోతివెంకటమ్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

నీలకంఠేశ్వరాలయంలో హోమం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్ధవటం: మండలంలోని కనుమలోపల్లె ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. జీర్ణోద్ధరణ పూర్వక పునఃఆలయ ప్రతిష్ట, నీలకంఠేశ్వర మరకత లింగేశ్వరస్వామి, పంచముఖ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, జీవధ్వజం , శిఖరం, సూర్యనారాయణ స్వామి విగ్రహాల ప్రతిష్టలో భాగంగా పూజలు నిర్వంచామని వేద పండితులు చైతన్యశర్మ తెలిపారు. ఉదయం నిత్యపూజ, క్షీరాధివాసం, అదివాసాంగ, పంచసూక్త హోమాలు, తీర్థ ప్రసాదల వితరణ పూజలు జరిపారు. సాయంత్రం వేదికార్చన, బలిహరణ, ధాన్యాధివాసం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమబాబు, మల్లేశ్వరరెడ్డి, లలితశర్మ, కిరణ్, క్రిష్ణయ్య, అచ్యుత్, సురేంద్ర పాల్గొన్నారు.

పశువులకు బ్రూసెల్లా టీకా


టీకాను పరిశీలిస్తున్న డా.గుణశేఖర్‌పిళ్లై

చిన్నమండెం: ప్రభుత్వం పశువులకు ఉచితంగా బ్రూసెల్లా టీకా వేయిస్తోందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డా.గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. చిన్నమండెం మండలం జి.రెడ్డివారిపల్లెలో పెయ్యదూడలకు బ్రూసెల్లా టీకా వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డా.గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ బ్రూసెల్లా వ్యాధి రాకుండా ఉండేందుకు మార్చి 19వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందని, 4 నెలల నుండి 8 నెలల వయస్సు గల పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలని పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డా.మాలకొండయ్య, డా.గణేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్చిలో ఎస్‌బీఐ ఉద్యోగుల సమ్మె

రైల్వేకోడూరు అర్బన్: మార్చ్ 25, 26వ తేదీలలో సమ్మె చేస్తున్నట్లు స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు జగదీష్, జశ్వంత్ పేర్కొన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యునైటెడ్ స్టేట్ బ్యాంక్ ఫోరం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగి వచ్చే వరకు నిరసనలు తెలుపుతామన్నారు. అన్ని కేడర్ ఉద్యోగులకు తగిన రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల బ్యాంకింగ్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రహదారి ఏర్పాటు చేయాలి


కాసులగుట్టకు వెళ్లే రోడ్డు

నందలూరు: మండలంలోని ఎర్రిపాపయ్యగారిపల్లి కాసులగుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని పాటూరు భక్తులు కోరుతున్నారు. స్వామి ఆలయంతోపాటు వేంకటేశ్వరస్వామి పాదముద్రిక గుట్టపై ఉండడంతో ఎక్కువమంది భక్తులు వస్తుంటారన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో బుడదమయమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు వేసేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

రైతు గుర్తింపు కార్డుకు నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీ చంద్ర నాయక్

ఓబులవారిపల్లి: గుర్తింపు సంఖ్య పొందేందుకు ప్రతి రైతు పేరు నమోదు చేసుకోవాలని ఏడీ చంద్ర నాయక్ అన్నారు. చిన్నఓరంపాడు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రనాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25వ తేదీ లోగా రైతులు గుర్తింపు సంఖ్య పొందాలని, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, నష్టపరిహారం వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు ఆటంకం లేకుండా వస్తాయని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలున్న రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మల్లిక, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.600తో చోరీలకు చెక్‌పెట్టే సెక్యూరిటీ లాక్



లాక్‌ను చూపుతున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు

రాయచోటి టౌన్: రూ.600ల విలువ చేసే సెక్యూరిటీ లాక్‌తో చోరీలకు చెక్ పెట్టవచ్చునని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇళ్లకు ఉపయోగించే సెక్యూరిటీ తాళం వేయాలని, ఎవరైనా దొంగలు, గుర్తు తెలియని వ్యక్తులు తాకిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సైరన్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. దీంతో దొంగలు ఆ ప్రాంతం నుంచి పారిపోయే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సెక్యూరిటీ తాళాలు తిరుపతిలోని లీలామహల్ సెంటర్‌లో లభిస్తాయని, రాయచోటికి తెప్పించి షాపులలో విక్రయించే విధంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం సైరన్ ఎలా వస్తుందనే దానిపై ప్రయోగాత్మకంగా(డెమో) చేసి చూపించారు. ముందుగా ఎస్ఎన్ కాలనీ వాసులతో మాట్లాడి సెక్యూరిటీ లాక్‌ను ఉపయోగించాలని అవగాహన కల్పించారు. ఎస్ఐలు నరసింహా రెడ్డి, జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

దొంగల బెడదతో రైతుల బెంబేలు


కాపర్ వైర్ ఎత్తుకెళ్లిన దొంగలు

లక్కిరెడ్డిపల్లి: బోరు మోటార్లలోని కాపర్ వైర్ లక్ష్యంగా దొంగల భీభత్సం రోజు రోజుకూ మితిమీరిపోతోంది. మండలంలోని అప్పకొండయ్యగారిపల్లి, చింతలకుంటవారిపల్లి, గంగనపల్లి, లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని రైతుల బోర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను ఎత్తుకెల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కస్తూరిరాజుగారిపల్లి, మద్దిరేవుల గ్రామంలో గురువారం రాత్రి కాపర్ వైర్లను అపహరించినట్లు చింతలకుంట వాండ్లపల్లె, అప్పకొండయ్యగారిపల్లి గ్రామస్తులు తెలిపారు. దొంగలు మోటార్లను పాడు చేయడంతో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. ఉన్న అరకొర నీటితో పంట సాగు చేసుకునే సమయంలో ఇలా మోటార్లను పాడు చేయడం, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు.

ఆలయానికి విరాళం


మల్లేశ్వరస్వామి

ఒంటిమిట్ట: మండలంలోని గుంటికాడపల్లిలో వెలసిన కొండా మల్లేశ్వర స్వామి ఆలయానికి రాజంపేట మాజీ శాసన సభ్యులు మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, రాజ్య సభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎంఆర్‌కెఆర్ ఎండీ, నియోజకవర్గ నాయకులు మేడా మధుసూదన్ రెడ్డి శుక్రవారం రూ.50116 విరాళం ఆలయ కమిటీకి సమర్పించారు. ఎంఆర్‌కెఆర్ కన్స్ట్రక్షన్స్ ఫౌండర్ మేడా రామకృష్ణారెడ్డి సతీమణి కే.శేలు మేడా లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు ఈ విరాళం ఇచ్చారు.

మార్చిలో లోక్ అదాలత్


మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్ కుమార్

రాజంపేట: మార్చి 8వ తేదిన జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని రాజంపేట జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ కోరారు. రాజంపేట కోర్టు భవనం ముందు పోలీసు అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, రసూల్ రెహానా, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు హనీ, వెంకటేశ్వర్లు, ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లుగా నియమించాలి

లక్కిరెడ్డిపల్లి: పది, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఎస్‌జీటీ, ఎస్ఏలను ఇన్విజిలేటర్లుగా నియమించాలని పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్ కోరారు. మార్చిలో జరిగే పది పరీక్షలకు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డాక్టర్ కెవీ.శ్రీనివాస్‌రెడ్డి కీలక మార్పు చేస్తూ మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. ప్రతి 20మంది విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ ఉండాలన్నారు.

మాతృభాషలో చదువుకొని రాణిస్తున్నారు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి జగదాంబ సెంటర్: మాతృ భాషలో చదువుకుని ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మాసాపేటలోని సుగవాసి రాజారాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పర భాషా వ్యామోహంలో మాతృభాష మరిచిపోవడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు సన్నగిల్లి పోయాయని తెలిపారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వేషధారణ

పుల్లంపేట: మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాతృ భాష దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు చిత్రలేఖనం, చేతిరాత, మెమోరీ గేమ్స్, పద్యాలు, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల తెలుగుతల్లి వేషధారణలాకట్టుకుంది. అనంతరం జరిగి కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు ఉన్న వ్యక్తి ఏ భాషనైనా నేర్చుకుంటారన్నారు.

తెలుగు భాషను గౌరవించాలి

పెనగలూరు: తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ పిల్లి రామకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కొండూరు జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆర్ నాగమణి, పెనగలూరు జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న రమాతుల్లా బుజ్జిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని కోరారు. విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను గురించి వివరించాల్సిన నవసరం ఎంతైనా ఉందన్నారు. ఆంగ్ల భాషకు ప్రాధాన్యం ఇస్తున్నారని, తెలుగును ప్రోత్సహించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, అల్లం అశోక్‌కుమార్, పుచ్చకాయల ఎల్లయ్య, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, అనీల్ కుమార్ పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

ఓబులవారిపల్లె: దేశ భాషలందు తెలుగు భాష గొప్పదని కరస్పాండెంట్ టి.యువరాజ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మండలంలోని రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో వేడుకలు నిర్వహిచారు. యువ రాజ మాట్లాడుతూ ఫిబ్రవరి 2002 నుంచి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరుపుకొంటున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దామోదరవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మండలంలోని కొత్తమాధవరం జెడ్పీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించగా 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల జానపద నృత్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మీ మాట్లాడుతూ భాష విలువలు తెలుసుకని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరికీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

భాష పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట: భాష పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని అన్నమాచార్య విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి అన్నారు. ఏయూలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష విశ్వ విఖ్యాత మైనదని, విదేశాల్లోనూ తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్నారన్నారు. వేంకటేశ్వర స్వామికి సంబంధించిన అనేక కీర్తనలు, శ్లోకాలు, అష్టకాలు, తెలుగులోనే లభ్యమయ్యాయని పేర్కొన్నారు. తెలుగు ఉపన్యాసకులు గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ తెలుగులో ఎన్నో పరిశోధనలు, చేసి భాషా వికాసానికి గొప్పసేవలు అందించారన్నారు. స్వీయ పరిశోధనల ద్వారా తెలుగు భాషా ధోరణులు, తెనాలి రామలింగ కథలు, ప్రాచీన తెలుగు నాటక రూపాల గురించి తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. మాతృ భాషలో విద్య అభ్యసిస్తే భావ వ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుందన్నారు. సృజనాత్మకత, ఆలోచనాశక్తి మరింత అభివృద్ధి చెందుతుంది. డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ యువతే భవిష్యత్ అని, మాతృభాషను పరిరక్షించడం, ప్రచారం చేయడం వారి బాధ్యతగా భావించాలని సూచించారు. విద్య, సాంకేతికత, ఉద్యోగ రంగాల్లో ఇతర భాషల ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, తమ మూలాలను మరవకుండా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డాక్టర్ ఎన్.వి.నారాయణ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ నేపథ్యం వివరించారు. భిన్న భాషల సంస్కృతులను, ప్రోత్సహించడం ముఖ్యమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంవీ.సుబ్బారావు, డాక్టర్ బి.జయరాం రెడ్డి, తదితరులు తెలిపారు.

ఆధునిక పరిశోధనలపై జాతీయ సెమినార్

రాజంపేట: బోయనపల్లిలోని అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫార్మా క్లినిక్ సినర్జీ (బ్రిడ్జింగ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ క్లీనికల్ ప్రాక్టీసు త్రూ ఇన్నోవేటివ్ రీసెర్చ్) అంశంపై సెమినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. సుమారు 400 మంది విద్యార్థులు వివిధ కళాశాల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ముఖ్య అతిథి వీసీ డాక్టర్ ఇ.సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ జాతీయ సెమినార్‌లో ప్రతి విద్యార్థి, అధ్యాపకులు పాల్గొని ఆధునిక రంగంలో పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ.నారాయణ, డాక్టర్ వారకనాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రాజంపేట రూరల్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుచేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని కె.బోయినపల్లి చౌడేశ్వరీ దేవస్థానం ఆవరణంలో ఈ నెల 24న నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బి.మల్లికార్జున, నాగభూషణం, శంకరయ్యరాజు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన పోరాటాలకు సిద్ధం


మాట్లాడుతున్న ఉదయకిరణ్

రాయచోటి అర్బన్: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉదయకిరణ్ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పాతరాయచోటిలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, హాస్టల్ విద్యార్థులతో పాటు పలు రంగాల కార్మికులు సమస్యలతో తల్లడిల్లుతున్నారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు వారితో మమేకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అన్యాయానికి గురవుతున్న వారికి, హక్కులను కోల్పోతున్న వారికి పార్టీనేతలు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత పాల్గొన్నారు.

త్రేతేశ్వరస్వామి ఆలయ టోల్ గేట్ వేలం


పెంచలయ్యకు అనుమతి పత్రం అందిస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్

రాజంపేట రూరల్: శివరాత్రి ఉత్సవాలలో భాగంగా అంగళ్లు, టోల్‌గేట్ రుసుము వసూలు చేసేందుకు తాళ్లపాక పెంచలయ్యకు లీజుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో శుక్రవారం టోల్ గేట్ వేలం నిర్వహించారు. హెచ్చు పాటపాడీ పెంచలయ్య వేలం దక్కించుకున్నట్లు తెలియజేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి మార్చి 02వ తేదీ వరకు అప్పరాజుపేట పంచాయతీలోని అత్తిరాలలో ఆయన టోల్ గేట్ వసూలు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏట బాలమునిస్వామి, రెడ్డిబాషా, హరి, వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం


హోమంలో బాలసుబ్రహ్మణ్యం దంపతులు

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం దంపతులు పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేద్దాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

సుండుపల్లె: మండలంలోని గ్రామాల అభివద్ధికి రాజకీయాలకతీతంగా తీర్మానాలు చేపట్టాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశ ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పక్కా గృహాలు కావాల్సిన ప్రజలు తమ సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సుండుపల్లి మండలాన్ని ఇప్పటికే కరువు మండలంగా ప్రకటించారని, వేసవి కాలాన్ని దష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ చిన్నగొల్లపల్లి, పాలిమేరపల్లి, గుండ్లపల్లి, సొంతంవారిపల్లి, రాయవరంలోని చీనేవాండ్లపల్లి గ్రామాలకు నీటి సమస్య ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. సర్పంచులు రామ జయచంద్ర, షరీఫ్ మాట్లాడుతూ అంగన్వాడీ స్కూళ్లలో నాడు-నేడు పనులు అర్ధంతరంగా ఆగిపోయాని తెలుపగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ సెంటర్‌కు రూ.2 లక్షల నిధులున్నాయని, సిమెంట్ తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదన్నారు. అధికారులు తమ శాఖలలో జరిగే అభివద్ధి పనులను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐలు శ్రీనివాసులు, భక్తవత్సలం, మోహన్‌నాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి కృషి చేస్తాం

నందలూరు: మండలంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తామని, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆ పార్టీ మండల కమిటీలకు పలువురు ఎంపికయ్యారు. నందలూరు మండల అధ్యక్షుడిగా సిద్ధవరం గోపిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా గీతాల నరసింహారెడ్డి, వాలంటరీవింగ్‌కు భాస్కర్‌యాదవ్ ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

రాయచోటి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ మీడియా ప్రతినిధిగా సి.బాల విజయ భాస్కర్, రాష్ట్ర పార్టీ జాయింట్ సెక్రటరిగా బి.గోవర్ధన్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువరించింది.

సుండుపల్లెలో...

సుండుపల్లె: వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా యర్రపురెడ్డి ఆరంరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్‌కు రామజయచంద్ర, మండల అధ్యక్షుడిగా ముప్పిరెడ్డి రామస్వామిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

కృష్ణాయాదవ్ నియామకం

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌గా రెండో పర్యాయం నియమితులైనట్లు పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన జెనుగు వేంకటకృష్ణయాదవ్(జేవీ కృష్ణారావు) శుక్రవారం తెలియజేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలియజేశారు.

కన్వీనర్‌గా భాస్కర్‌రాజు

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నాలుగో పర్యాయం నియమితులైనట్లు ఎంజీపురం పంచాయతీ ఎస్ ఎర్రబల్లి గ్రామానికి చెందిన దొడ్డిపల్లి బాస్కర్‌రాజు శుక్రవారం తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను చిత్త శుద్ధితో అమలు చేస్తానని తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఒంటిమిట్ట: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి పార్టీ బాధ్యతలు అప్పగించిందన్నారు.